జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..

ఈ నెల 7న నవ కలశ పూజ, అయ్యప్ప పడి పూజా మహోత్సవం

❖ దీక్షాధారణ స్వాములు పాల్గొని విజయవంతం చేయండి

దశ సూర్యాపేట ప్రతినిధి: ఈ నెల 7న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రిలయర్స్ ట్రెండ్స్ ఎదురు సందులో నిర్వహించే నవ కలశ పూజ, అయ్యప్ప పడి పూజా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు గుండా వెంకన్న (సుమన్), గోపారపు రాజు, బొల్లం సురేష్ లు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక శబరి నగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో మాలధారణ స్వాములకు నవ కలశపూజ, అయ్యప్ప పడిపూజ మహోత్సవానికి ఆహ్వానించి మాట్లాడారు. ఈ నెల 7న సాయంత్రం 5.30 నిమిషాలకు నిర్వహించే ఈ పూజా కార్యక్రమాలకు అన్ని మాలధారణ స్వాములు హాజరు కావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మొరిశెట్టి రాము, యాట సతీష్, బి.కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులు ఉన్న బడంగ్ పేట్ ను ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయండి

❖ మీర్ పేట్, జల్ పల్లి, తుక్కుగూడ, ఆదిభట్ల, తుర్కయంజాల్ మున్సిపాలిటీలను బడంగ్ పేట్ లో నే కలపండి

❖ జీహెచ్ ఎంసి కమిషనర్ కర్ణన్కు లేఖ అందజేసిన బడంగ్ పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత

❖ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణకు వినతి

దశ, బడంగ్ పేట్: బడంగ్ పేట్ ను ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలని కోరుతూ జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి లేఖను అందజేశారు. అదేవిధంగా సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కార్యాలయంలో మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణ ను కలిసి బడంగ్ పేట్ ప్రత్యేక జోన్ ఏర్పాటు కోరుతూ లేఖను అందజేసినట్లు మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ చిగిరింత పారిజత నర్సింహారెడ్డి మాట్లాడుతూ జీహెచ్ఎంసిలో విలీన విషయమై ప్రతి పక్షాలు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని, ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసే కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం తాత్కాలికంగా కేటాయించిన ప్రభుత్వ చర్యలను స్థానిక ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు అవగాహన రాహిత్యంతో ప్రజల్లో ఆందోళన కలిగించేలా రెచ్చగొడుతున్నారని అన్నారు.

ఒక్కరోజులోనే బడంగ్ పేట్ ను ఎల్బీనగర్ లోకి మార్చుతున్నట్లు ఎమ్మెల్యే చెపస్పడం హాస్యాస్పదం.....

ఒక్కరోజులోనే స్థానిక ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడినట్లు మార్చుతున్నట్లు వారు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ప్రజలు ఎవరు ఆందోళన చెందవద్దని త్వరలోనే డివిజన్లు ఏర్పాటు, సర్కిళ్ల ఏర్పాటు ఓటర్లు గణన చేపట్టి అప్పుడు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని అనుకుంటున్నట్లు చెప్పారు. కానీ మేము కూడా ప్రభుత్వంలో భాగంగా ఉన్నప్పటికీ జీహెచ్ ఎంసీ లో కలపబడిన మీర్ పేట్, జల్ పల్లి, తుక్కుగూడ, ఆదిభట్ల, తుర్కయంజాల్ మున్సిపాలిటీలను అన్ని కలిసి బడంగ్ పేట్ జోన్ గా ఏర్పాటు చేయాలని ఈ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, అన్ని మున్సిపాలిటీలకు కేంద్రంగా ఉంటుందని, ప్రజలకు రవాణా సౌకర్యంతో పాటు

అన్ని వసతులు ఇప్పటికే ఉన్నాయన్నారు. కాబట్టి ప్రత్యేక జోన్ గా ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పెద్దలను తాము కోరుతున్నట్లు లేఖను అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా బీజేపీ పార్టీ ప్రజలలో వైషమ్యాలు కలిగించడం మానుకోవాలని హితువు పలికారు. బిఆర్ ఎస్ పార్టీ మాత్రం రోజుకో మాటలతో ప్రజలను అయోమానికి గురిచేయడం మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొర్రా జగన్ రెడ్డి, నాయకులు దిండు శ్రీనివాస్ గౌడ్, మైనార్టీ చైర్మన్ అఫ్జల్, గిరి ముదిరాజ్, జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

❖ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

❖ నర్కుడ, చౌదరిగూడలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎన్నికల ప్రచారం, రోడ్ షో

దశ, రాజేంద్రనగర్: సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కోరారు. సర్పంచ్ ఎన్నికలలో ప్రచారంలో భాగంగా శుక్రవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నర్కుడ, చౌదరి గూడలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గడ్డం శేఖర్ యాదవ్,మల్పలం లక్ష్మి లింగం లకు మద్దతుగా శంషాబాద్ మాజీ జెడ్పిటిసి నీరటి తన్వీరాజ్ లతో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పడ్డాక గ్రామాల అభివృద్ధి కొరకు పెద్దపీట వేశారన్నారు.

ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నారని ప్రభుత్వం ఏర్పడ్డ వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 కే గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ పథకాలను తీసుకువచ్చి పేదవారికి నేరుగా అందే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పకడ్బందీగా కృషి చేశారన్నారు. ఈ సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఇతర పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని అభివృద్ధి చేసే ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్ గుప్త, నీరటి రాజు ముదిరాజ్, జల్లపల్లి నరేందర్, సంజయ్ యాదవ్, జహంగీర్ ఖాన్, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, మహేందర్ ముదిరాజ్, శివాజీ, శేఖర్, మహేష్, మెరుగు సురేష్, దేవేందర్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుంది

❖ కులమతాలకతీతంగా స్వాములకు అన్నదానం చేయడం అభినందనీయం

దశ సూర్యాపేట: సంస్కృతి సంప్రదాయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శబరి నగర్ లో గల అయ్యప్పస్వామి దేవాలయంలో యువజన కాంగ్రెస్ నాయకులు షేక్ ఫరూక్ ఆధ్వర్యంలో వివిధ మాలాధార స్వాములకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కుల మతాలకతీతంగా యువజన కాంగ్రెస్ నాయకులు ఫరూక్ మాలధార స్వాములకు గత కొన్ని సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ పూర్వ వైభవం తీసుకొస్తుందన్నారు. 41 రోజులపాటు దీక్ష చేపట్టి భగవంతుని పూజిస్తూ కటోరమైన నియమ నిబంధనలను పాటించడం గొప్ప విషయం అన్నారు. భగవంతుని కృప ప్రజలపై, రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డి పై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అన్నదానానికి తన వంతుగా ఆర్థిక సాయం అందజేస్తున్నానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, వల్దాస్ దేవేందర్, పిల్లల రమేష్ నాయుడు, గొట్టి ముక్కల శ్రీనివాస్ రెడ్డి, జటంగి రవి, గోపారపు రాజు, గుండా వెంకన్న, వివిధ మాలధర స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్ ఈ సీ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

❖ పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి

❖ ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

దశ, ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ ఈ సీ) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, ముస్తాబాద్ లోని రైతు వేదికలో శుక్రవారం ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హాజరై ఎన్నికల నిర్వహణ, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పీపీటీ ప్రదర్శన ఇచ్చి ప్రతి అంశంపై వివరించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఎస్ ఈ సీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా, నీటి వసతి తదితర సదుపాయాలు తనిఖీ చేయాలని, సంబంధిత ఎంపీడీఓలు, అధికారులతో ఆ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. అనంతరం లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టు మరోసారి మొట్టికాయలు

దశ, హైదరాబాద్ : హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టు మరోసారి మొట్టికాయలు వేసింది. తమ ఉత్తర్వులు ఉన్న తర్వాత కూడా బతుకమ్మకుంట పరిధిలోని కట్టడాలను ఎందుకు కూల్చివేశారని ప్రశ్నించింది. కోర్టు వివాదంలో ఉన్న బతుకమ్మకుంట పరిధిలోని స్థలం విషయంలో స్టేటస్ కో కొనసాగించాలని జారీచేసిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై ఏ సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన కోర్టు ధికరణ పిటిషన్‌పై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం విచారణ జరిపింది. ఈ విచారణకు రంగనాథ్ వ్యక్తిగతంగా హాజరయ్యారు.

ఈ పిటిషన్‌పై తొలుత అక్టోబర్ 31వ తేదీన విచారించిన హైకోర్టు.. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో నవంబర్ 27వ తేదీన వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని రంగనాథ్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున హాజరుకాలేకపోతున్నానని.. మినహాయింపు కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నవంబర్ 27న విచారణ జరిపిన ధర్మాసనం రంగనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఊరిళ్ల వాదిస్తూ, రంగనాథ్ అధికారిక విధుల్లో పాల్గొనాల్సి ఉన్నందున విచారణకు హాజరుకాలేదని చెప్పారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. 'రంగనాథ్ కోర్టు పట్ల చూపిన దయకు అభినందనలు' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. కోర్టు తలచుకుంటే ధికరణ చర్యలు ఉంటాయని, ఇదే కోర్టు హాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలబెట్టిస్తామని వార్నింగ్ ఇచ్చింది. కోర్టుకున్న అధికారాలను రంగనాథ్ మరచిపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ధర్మాసనం తేల్చి చెప్పింది. అలాంటి పరిస్థితులను రంగనాథ్ తెచ్చుకోవద్దని సూచించింది. డిసెంబర్ 5న జరిగే విచారణకు వ్యక్తిగతంగా రంగనాథ్ హాజరుకావాల్సిందేనని తేల్చి చెప్పింది. లేకపోతే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలో శుక్రవారం నాడు రంగనాథ్ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు.ఈ సందర్భంగా జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారిస్తూ.. తమ ఉత్తర్వులు ఉన్న తర్వాత కూడా ఎందుకు కూల్చారని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ప్రశ్నించారు. దీనికి వ్యర్థాలనే తొలగించామని హైకోర్టుకి రంగనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా రంగనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.

కర్ల రాజేష్ మృతికి కారకులైన వారిని చట్టపరంగా శిక్షించాలి

❖ పందిటి నవీన్ కుమార్ మాదిగ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ సూర్యాపేట జిల్లా కన్వీనర్

దశ, నడిగూడెం : స్థానిక నడిగూడెం మండలం కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నడిగూడెం ఎమ్మార్వో ఆఫీస్ లో తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ఐ కి వినతి పత్రం అందచేశారు. కర్ల రాజేష్ మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. కోదాడ పట్టణానికి చెందిన దళిత యువకుడు కర్ల రాజేష్ ను ఏ పిర్యాదు లేకుండా చట్టవిరుద్ధంగా కస్టడీలోకి తీసుకొని నాలుగు రోజుల పాటు క్రూరంగా హింసించి అతని చావుకు కారకులైన చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి మీద మరియు కోదాడ రూరల్ సిఐ ప్రతాపలింగం మీద హత్య కేసు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు తక్షణమే నమోదు చేసి విధుల నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కోదాడ పట్టణంలో వేలాది మందితో ప్రదర్శన చేపట్టి కర్ల రాజేష్ సంతాప సభను జరపబోతున్నాం. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పీడిత ప్రజల ఆశాజ్యోతి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పాల్గొంటారు అని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సూర్యపేట జిల్లా అధ్యక్షులు చింత వినయ్ బాబు మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకులు మద్దిలేటి మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు వి యస్ రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు ముంజూరు విజయ్ మాదిగ ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పందిటి నవీన్ మాదిగ, జిల్లా ప్రచార కార్యదర్శి మొలుగురి రాజు నడిగూడెం గ్రామశాఖ అధ్యక్షుడు దున్న వంశీ, గంటేపంగు నమ్రుత్, శ్రీరంగాపురం గ్రామ కమిటీ సభ్యులు లంజపల్లి రాము, సైదులు, శ్రీను, నిఖిల్, నడిగూడ మండల కేంద్రంలోని తదితర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆపరేటర్లకు అద్భుత అవకాశం

❖ ఈపీ ఆపరేటర్లుగా ఎంపికకు సర్టిఫికెట్ల; ధృవీకరణ ఇంటర్వ్యూల నిర్వహణ

దశ, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో ఓపెన్ కాస్ట్ గనుల్లో కూడా మహిళా కార్మికులకు అవకాశం కల్పించాలన్న సీఎండీ ఎన్.బలరామ్ ఆలోచన మేరకు సంస్థలో ప్రస్తుతం జనరల్ అసిస్టెంట్ గా లేదా బదిలీ వర్కర్లుగా పనిచేస్తున్న మహిళలకు సింగరేణి యాజమాన్యం తొలిసారిగా ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పని చేయడానికి అవకాశం కల్పిస్తోంది. ఇటీవలనే దరఖాస్తులకు ప్రకటన చేయగా మొత్తం 43 మంది మహిళా కార్మికులు దరఖాస్తు చేశారు. వీరిలో ఇంటర్వ్యూలకు 35 మంది హాజరయ్యారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎంపిక కమిటీ సభ్యులు జీఎం(సీపీపీ) ఏ.మనోహర్, జీఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, జీఎం(ఓసీపీ)పి.ఎలిషా, సీఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్, జీఎం(హెచ్ఆర్‌డి) ఆర్. విజయ ప్రసాద్, జీఎం(ఎంఎస్)బొజ్జా రవి మహిళా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరక్టర్ ఆదేశాల మేరకు మహిళలు ఏ రంగంలోనైనా పురుషులతో సమానంగా పనిచేయగలరు అనే ఉద్దేశంతో ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలపై ఆపరేటర్లుగా పనిచేడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించటం జరిగిందని ఇది ఒక గొప్ప అవకాశం కనుక ఎంపికైన అభ్యర్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలి

❖ ప్రభుత్వ కళాశాలలో సిద్ధు రెడ్డి మౌలిక వసతులు కల్పించడం హర్షణీయం: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

❖ సామాజిక వేత్త సిద్ధు రెడ్డి ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటుచేసిన వాటర్ ఫిల్టర్, బాస్కెట్‌బాల్, టాయిలెట్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

దశ, రాజేంద్రనగర్: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని మంచిగా చదువుతూ ముందుకు సాగాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శంషాబాద్ కు చెందిన సామాజిక వేత్త సిద్ధు రెడ్డి ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటుచేసిన వాటర్ ఫిల్టర్, బాస్కెట్‌బాల్, టాయిలెట్స్ ను శుక్రవారం శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సుష్మా రెడ్డి, ఎన్నారై ఇఫ్తకార్ షరీఫ్ లతో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతోమంది వ్యాపారస్తులు వ్యాపారం చేస్తూ డబ్బులు సంపాదిస్తారు కానీ ప్రజలకు, ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలకు సేవ చేయాలని ముందుకు వచ్చిన సిద్ధు రెడ్డి మనస్తత్వం ఎంతో గొప్పది అన్నారు. 35 లక్షలు ఖర్చుపెట్టి ప్రభుత్వ కళాశాలలో టాయిలెట్స్, బాస్కెట్‌బాల్ కోర్టు, వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడం గొప్ప పరిణామం అన్నారు. సిద్ధి రెడ్డి ఈ కళాశాలతోనే కాకుండా పాలమాకుల సిబ్బంది ప్రభుత్వ పాఠశాలను కూడా ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తన వంతు సహాయకంగా వికలాంగులకు ట్రై సైకిల్ ఇవ్వడం, పేదవారికి సాయం చేయడం చూస్తుంటే సిద్ధు రెడ్డిని ఎంత అభినందించిన తక్కువే అన్నారు. ప్రభుత్వం తరపున కూడా శంషాబాద్ ను ఎంతో అభివృద్ధి చేస్తున్నామని అభివృద్ధిలో దాతలు కూడా భాగస్వాములు కావడం ఎంతో సంతోషం అన్నారు. విద్యార్థులు కూడా కష్టపడి చదివి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇప్పుడు ఉన్న ప్రతి ఒక్క నాయకులు వ్యాపారస్తులు ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో చదివిన వారే అన్నారు. ప్రభుత్వం కూడా ప్రభుత్వ కళాశాలలు పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేస్తుందన్నారు. బస్టాండ్ నుండి ప్రభుత్వ కళాశాల వరకు మినీ ఆర్టిసి బస్సులు కూడా అతి త్వరలో నడిపే విధంగా ఆర్టీసీ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.